

కథానిక...

# గడ్డిపూలు

రచన: విహారి & శాలివాహన

తన జీవితము మోడయిపోయినా చెల్లెలు ప్రేమించి పెళ్ళి చేసుకుంటోందంటే మురిసిపోయింది. అయితే చెల్లెలు ఎవర్ని ప్రేమించింది?... అతన్ని ఆమె పెళ్ళిచేసుకో గలిగిందా?

"అక్కా!"

నీ వుత్తరం అంది వారంరోజులైంది. నీవు వ్రాసిన విషయాలు బాగానే అర్థంచేసుకున్నాననుకుంటాను. అందుకునే సమాధానం ఏమని వ్రాయాలో, ఎలా వ్రాయాలో తెలియటంలేదు. అమ్మా, నాన్న మనిద్దరికీ సమానంగానే చదువు చెప్పించారు. నీవు చదువు ముగించుకుని ఉద్యోగం చేస్తున్నావు. నేను చదువు ముగించుకుని శెలవులకు ఇంటికి వచ్చాను. మనిద్దరికీ పెళ్ళిళ్లుచేసి తమధర్మాన్ని నెరవేర్చుకోవాలనుకుంటున్నారు, అమ్మా, నాన్న. జీవితంలో వివాహం అనేది అతి ముఖ్యమైన సంఘటన అని, రెండు మనసులు ఒకటై ఒకేదారిన జీవనరథాన్ని నడుపుకోటానికి కుదుర్చుకున్న ఒప్పందమనీ, మనసులు కలిశాయని భ్రమపడినా, కలసిన మనసులు విడివడినా జీవనపథం కంటకమయమేనని, కనుక జీవనభాగస్వామిని ఎన్నుకునేముందు ముందువెనుకలు, మంచి-చెడులు, అంతస్థులూ అంతఃకరణలూ - అన్నీ ఆలోచించుకోమని రాశావు. నా ప్రశ్నకు సమాధానంగా నీవు వ్రాసిన వాక్యాలు మాత్రం నా మనస్సుకు హత్తుకున్నాయి. ఆశ్చర్యం, ఆనందం, జాలి, విచారం అన్నీ కలసిన ఒక మరచిపోలేని అనుభూతిని నాకు కల్గించాయి. 'పెద్దమ్మాయి పెళ్ళి జరగకనేగాని చిన్నమ్మాయికి పెళ్ళిచేసే వీలులేదనేది లోకాచారమే కావచ్చు కాని మన విషయంలో ఆ ధర్మాన్ని పాటించాల్సిన అగత్యంలేదు. ఎందుకంటే నాకిప్పుడు పెళ్ళి చేసుకోవాలనిలేదు. నిజం చెప్పాలంటే అసలు చేసుకోనేమో కూడా, అదంతా వేరే కథ. ఒకరి ఆనందానికి మరొకరు అడ్డుకావటమనేది నాకు నచ్చదు. నీ సంతోషమే నా సంతోషం. నేనింతకంటే వ్రాయలేను. అర్థం చేసుకుని అమ్మా నాన్నలకు నచ్చచెప్తావని ఆశిస్తున్నాను. మీ దంపతుల నాశీర్వదించటానికి తప్పకుండా వస్తాను' అని రాశావు.

అక్కా! నీ వింత గడుసుదానవని అనుకోలేదు. అయితే పోయినసారి నిన్ను చూసినప్పుడే అనుకున్నాను నీవేదో తీరని వ్యథతో, తెగని సమస్యతో మథనపడుతున్నావని. నీ మనోవ్యథకు కారణమైన రహస్యాల్ని నా దగ్గర కూడా దాచావా అక్కా!

అక్కా- చెల్లెళ్ళమైనా, వయసులో ఎక్కువ వ్యత్యాసంలేని మనం స్నేహితుల్లాగా మెలిగామే, మనలో మనకు దాపరికాలా? నా సంతోషమే నీసంతోషమైనప్పుడు నీసమస్యలు నా సమస్యలు కావా?

నా మనసుకు, వయసుకు తగిన వ్యక్తినే భర్తగా ఎన్నుకున్నానని నేననుకుంటున్నాను. అక్కా! ఆయన చాల మంచివారు. కల్లకపటం తెలియనివారు. శెలవులిచ్చి నెలరోజులైందో కాలేదో 'నువ్వులేంది నాకు తోచటంలేదు నళినీ' అంటూ ఎనిమిది ఉత్తరాలు రాశారు. అందుకని ఇక్కడికి వస్తారుట. అమ్మా, నాన్న వారిని చూచినట్టుకూడా వుంటుందని రేపు ఒకటో తేదీకి రమ్మనమని వ్రాస్తున్నాను. అక్కా! అప్పటికి నీవుకూడా తప్పకుండా రావాలి. నా ఎన్నిక సరియైనది ఔనో కాదో నీవు చెప్తేనేకాని నాకు తృప్తి వుండదు. అదీగాక నీ సమస్యల్ని కూడా నాకు చెప్పాలి తప్పకుండా వస్తావని నమ్ముతూ

నీ—నళిని"

ఉత్తరాన్ని మరోసారి చదువుకుని కవరులో పెట్టి, అంటించి, అడ్రసు వ్రాసి పోస్టు చేసింది నళిని. మనసు ఎంతో తేలికైనట్లు అనిపించింది. ప్రేమించిన వ్యక్తిని పెళ్లిచేసుకోటానికి అందరి అంగీకారం లభించినపుడు స్త్రీ ఆనందానికి అవధులేముంటాయి?

మరో వారంరోజుల్లో వారు వస్తారు. వారినిచూసి ఎన్నో ఏండ్లు అయినట్లుగావుంది. వారి సాన్నిధ్యంలో వుంటే కాలగమనాన్ని కూడా గమనించలేదీ మనసు. వారిని అక్కయ్యకు పరిచయం చేయాలి. అక్క ఏమంటుందో అన్నట్లు అక్క సమస్యలేమిటో, ఎవరినైనా ప్రేమించిందా? ప్రేమిస్తే పెళ్ళి చేసుకోవచ్చుగా! అమ్మా, నాన్న అడ్డు చెప్తారనా. హుఁ. కామెర్లవానికి లోకమంతా పచ్చగా కనుపిస్తుందన్నట్లు నాలాగా అందరూ ప్రేమిస్తారనుకుంటున్నానేమిటి? ఏమో. అయినా అన్నివిషయాలూ అడిగి తెలుసుకోవాలి — అనుకుంటూ ఇల్లు చేరుకుంది నళిని.

2

రాఘవయ్యగారు రిటైరు కాబోయే ఎలిమెంటరీస్కూలు టీచరు. ఎక్కువగా బొటాబొటీ లేని జీతపు సంపాదనతో జీవితంలో పోరాడి ఎదురుదెబ్బలు తిని ఓడిపోయిన పేరుపేరుని ప్రఖ్యాతి గడించిన పంతులుగారు. భార్య వరలక్ష్మమ్మకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎదురుచెప్పి ఎరుగని ధర్మరాజు. అలాంటి మహారాజుకు సాక్షాత్తు మహారాణి అయిన వరలక్ష్మమ్మగారు తమ సంసార నౌకకు తానే ఏకైక చుక్కాని అయింది. అటు స్కూల్లోనూ శ్రమపడి ఇటు గృహకృత్యాల్లోనూ కలుగజేసుకుంటే భర్త అలసిపోతాడేమోనని జాలితలచి ఆమె రాఘవయ్యగారిని 'పంతులుగారు'గానే వుంచింది. నెలనెల జీతపురాళ్ళని భర్త చేతుల్లోనుంచి లాక్కుంటుందని కొందరంటారేగాని అది నిజం కాదు. రాఘవయ్యగారే ఆమె చేతిలో పెడ్తారు. ఆమె మాటకు తిరుగులేదు. ఆమె నగ్నాళి అనీ, భర్తను బడిపిల్లవాడిక్రింద జమ

కట్నంవల్ల గిట్టుబాటవాళ్ళేమోనా అనుకుంటారు. అయినా ఆమె అందుకు బాధపడదు 'నేనేం చేసినా నా సంసారం సాక్షిగా నడవాలనేగదా చేసేది' అంటుందామె.

అలాంటి వరలక్ష్మమ్మగారికి రానురాను మనసులో దిగులు ఎక్కువైంది తన తెలివితేటలు, పొదుపరితనం, మాటకారితనం ఈ నాటికి ఎందుకూ పనికిరాకపోయాయే అని ఆమె దిగులు. తన తెలివితేటల్ని నలుగురు కూతుళ్ళకూ సమానంగా పంచిపెట్టింది. పెద్ద [illegible] బడి చదువులో ఆపి, పని-పాటా, వంటా-వార్పూ నేర్పి, ఎక్కువ కట్నాలు ఇచ్చుకోలేని కారణాన ఏదో గంతకు తగిన బొంతను కుదిర్చి పెళ్ళిళ్ళు చేసింది రెండు సంవత్సరాల తేడాతో ఇక మూడవ అమ్మాయి సరోజనికికూడ మరో గంతను వెదికే ప్రయత్నంలో వుండగా అనుకోని రెండు సంఘటనలు ఆమె ప్రయత్నాన్ని ఆపినై. పెద్దఅల్లుడు చనిపోయి కూతురు పుట్టిల్లు చేరింది. రెండవ అల్లుడికి రెండో పెళ్ళియోగం వుందని ఒక జ్యోతిష్కుడు చెప్పాడుట. కనుకనే కట్నం తక్కువైనా ఎలాగూ రెండో పెళ్ళి జరుగుతుంది గదా అనే వుద్దేశ్యంతో ఈ పెళ్ళి చేసుకున్నాడుట. పెళ్లయి రెండు సంవత్సరాలైనా భార్య దుక్కలా వుండటంతో ఆ మగడికి భయం పుట్టుకొచ్చింది, చావదేమోనని. కృషితో నాస్తి దుర్భిక్షమని గదా ఆర్యోక్తి! మనుష్య ప్రయత్నంచేస్తేనే కదా దైవబలం సమకూడి అనుకున్న పనులు సమకూరేటం! ఆ నమ్మకంతోనే అతడు భార్యను దుర్భాషలతోనూ, దుశ్చర్యలతోనూ రాచి రంపాన పెట్టాడు నిష్కారణంగా భర్తపెట్టే హింసకు ఆ ఇల్లాలు మొదట్లో అల్లాడిపోయినా, నిలకడమీద ఆయన ఆంతర్యాన్ని గ్రహించి అమాంతంగా ఆత్మహత్య చేసుకుని భర్త కోరికను నెరవేర్చింది ఆ సంవత్సరమే పెద్ద కూతురు కూడా వరలక్ష్మమ్మగారిని వీడిపోయింది.

వరలక్ష్మమ్మగారి గుండెల్లో బండ పడ్డట్లయింది. కలకాలం కలకలలాడాల్సిన ఇద్దరు కూతుళ్ళూ ఈ విధంగా అర్ధాంతరంగా తన అవివేకపు ఎన్నికపు గురికావటంతో వరలక్ష్మమ్మగారు మిగతా ఇద్దరమ్మాయిల విషయంలో జోక్యం కలుగజేసుకో దల్చుకోలేదు. చిన్నవయసులో పెళ్లిళ్ళు చేసినందువల్లనే అలాంటి దుర్ఘటనలు జరిగాయని ఆమెలో పిచ్చినమ్మకం ప్రబలింది. మరొక విశేషమేమిటంటే పెద్దమ్మాయిలిద్దరూ ఇరవయ్యో ఏటే చనిపోయారు. అందుకని ఆ వయసు దాటిన తర్వాతనే ఉన్న అమ్మాయిల పెళ్ళిమాట తలపెట్ట వచ్చుననుకుంది అందాక ఊరకేవుండటం ఎందుకని ఇద్దర్నీ బీ యస్సీవరకూ చెప్పించింది సరోజినికి ప్రసిద్ధ సంగీతాచార్యుడు బాలకృష్ణవద్ద సంగీతంకూడా కొంతచెప్పించిందని వినికిడి.

'నీ కూతుళ్లకు పెళ్ళిళ్ళు చేయవుటమ్మా' అని ఎవరైనా అడిగితే తన నమ్మకాన్ని ఏకరువుపెట్టి 'ఆ వయసు' దాటింతర్వాతనే అని సమాధానం చెప్పేది. అయితే కొందరు మాత్రం చెవులు కొరుక్కుంటూరు 'ఇదంతా నాటకం. చేసుకుంటామంటూ ఒక్కసంబంధమైనా ముందుకు రానప్పుడు, ముందుకు వచ్చినవాళ్ళకు కోరిన కట్నం ఇవ్వలేనప్పుడు ఇక పెళ్ళిళ్ళెలా అవుతాయి? తమలోటును కప్పిపుచ్చుకోటానికి ఏవో కారణాలు చెప్తున్నంత మాత్రాన ఎవరు నమ్ముతారు' అని.

ఏమైతేనేం, సరోజిని, నళిని పూర్వాచారాల ప్రకారం బాల్యవివాహాల పాలబడకుండా నవనాగరిక సంప్రదాయం ప్రకారం వేషభాషల్ని అలవర్చుకుంటూ చదువును కొనసాగించారు. ఒక సంవత్సరం క్రితమే సరోజిని చదువు పూర్తిచేసుకొని ఉద్యోగంలో చేరి అడపా దడపా అమ్మా నాన్నలను, చెల్లెల్ని ఆర్థికంగా ఆదుకుంటూ వచ్చింది. ఈ కారణాలవల్ల ఆ కుటుంబం ఇప్పుడు ప్రశాంతంగానే నడుస్తోంది.

## 3

నళిని ఆరోజు మస్తుగా ముస్తాబైంది. తలంటి పోసుకుని, నిడుపాటి కురుల్ని పొడి ఆర్చుకుని రెండు జడలుగా సగం సగం అల్లి సమానాంతరంగా వ్రేలాడవేసుకుంది గులాబీ రంగువంటి తన మేనికి సరిపడే పాలనురుగు వన్నె జార్జెట్ చీరకట్టి, పావురాయి కంఠం రంగు మొఖమల్ జాకెట్ తొడిగింది వెన్నెలను తాగి తాగి మత్తెక్కి, ఆ మత్తులో పైనుండి కురిసే మంచుబరువుకు తట్టుకోలేక క్రిందరాలిన పారిజాతపూలను దండగుచ్చి రెండు జడల మధ్యనున్న అగాధమైన అఖాతానికి వారధి కట్టింది. తన మనసులోని ఆలోచనలను మిలమిలమెరిసే తన కళ్లలో ఎవరైనా ఇట్టే చదివేస్తారని కళ్లకు నల్లని కాటుకను దట్టంగా పులిమి జాగ్రత్తపడింది వీటన్నింటికీ వన్నె తెచ్చే ఎఱ్ఱటి తిలకాన్ని నుదుట దిద్దింది ఒక చేతికి రిస్టువాచీని రెండోచేతికి ఒక్కజత రేడియోగాజులు - బంగారపువి వేసింది.

నళిని ముస్తాబు ముగిసేసరికి ఎనిమిదిగంటలైంది. వరలక్ష్మమ్మగారు అప్పటికి టిఫిన్, కాఫీ సిద్ధంచేసింది.

మూడుసార్లు వీధిలోకివెళ్ళి చూసి వచ్చింది నళిని. 'వస్తారులేవే అంతగా ఆత్రుత పడావేం?' అని వరలక్ష్మమ్మగారు అంటే 'నీకేం తెలుసునమ్మా తాతగారి కోపలివి' అనుకుంది నళిని తనలో తాను.

అంతలోనే వీధి గుమ్మంలో రిక్షా ఆగింది. రిక్షావాలా సూట్‌కేసును తీసుకొని లోపలికొచ్చాడు, మురళి రిక్షావాడికి కూలీ ఇచ్చి పంపేశాడు. ఆ వచ్చిన వ్యక్తి ఎవరై వుంటారా అని రెండు మూడు నిముషాలు ఆలోచించిన నళినికి మురళి పెదాలమీది చిరునవ్వు అతనెవరో తెలియచేసింది 'నా మురళేనా?' అని మనసును ప్రశ్నించింది. సిందునూటులో దిగుతారనుకుంటే ఈ వేషమేమిటి కవి కుమారిడిలా గ్లాస్కో లంచె, బంగారురంగు శిల్కు లాల్చీని? ఇది ఏ అవతారం చెప్మా అని ప్రశ్నించుకుంది. వైర్‌లెస్‌ద్వారా ఆ ప్రశ్నను విన్న మురళి తన చిలిపికళ్ళతోనే బదులు చెప్పాడు 'సమ్మోహనావతారమ'ని.

ప్రస్తుతం లోపడి 'మీరా' అంది నళిని, ఈ వేషంలో మిమ్మల్ని గుర్తుపట్టలేకపోయాను సుమా అనే ధోరణిలో.

ఆమె నోటివెంట వచ్చిన ఆ రెండు అక్షరాల చివర ఆశ్చర్యార్థకమో, ప్రశ్నార్థకమో తెలియక రెండూ కాదు సంబోధన అనుకొని 'కాను, మురళిని' అన్నాడు మురళి.

ఆ జవాబుకు ఎంతో నవ్వాలని తెలియక అవస్థపడుతున్న నళినికి వరలక్ష్మమ్మగారి రాక సమస్యానివారణ అయింది. వరలక్ష్మమ్మగారు వస్తూనే 'వచ్చినట్లున్నారు' అంది మురళివేపు చూస్తూ.

(తరువాయి 21 వ పేజీ)

## ★ గ డ్డి పూ లు ★

(12 వ పేజీ తరువాయి)

'వచ్చారమ్మా, వీరే మురళిగారు మా కాలేజీలో డెమాన్‌స్ట్రేటరు; మా అమ్మగారు' అంటూ పరిచయవాక్యాలు పలికింది నళిని. మురళి బుద్ధిమంతుడిలాగా 'నమస్కారమండీ' అన్నాడు.

వరలక్ష్మమ్మగారు మురళిని పరీక్షగా చూసి 'కూర్చో నాయనా' అంది. మురళి కూర్చున్నాడు.

'అమ్మా మాష్టరుగారికి కాఫీ తీసుకురానా' అని సమాధానానికి ఎదురుచూడకుండానే లోపలికి పరిగెత్తింది నళిని. ఆమె వెంట వరలక్ష్మమ్మగారు కూడా లోపలికి నడిచింది.

మురళి ఆ హాలును కలియజూశాడు. అందంగా అలంకరించబడివుంది. గోడలపైన ఒకటి రెండు దేశనాయకుల ఫొటోలు, ఏవో రెండు పిల్లలగ్రూపు ఫొటోలు మాత్రం వున్నాయి. టేబులుపైన తెల్లని టేబులు క్లాత్, రెండు ఫ్లవర్‌వేజులు, వాటిలో రెండు మూడు రంగుల గడ్డిపూలగుత్తులు వున్నాయి. మురళికి నవ్వు వచ్చింది. గుంటూరులో వున్నప్పుడుకూడా అతి కష్టంమీద ఆ పూలని సంపాదించి ఫ్లవర్‌వేజులో అమర్చేది నళిని. నళినికి ఈ గడ్డిపూలంటే ఎందుకో ఇంత అపేక్ష అనుకున్నాడు.

ఇంతలో ఏవరో వ్యక్తి అక్కడికి రావటంతో మురళి ఆలోచనలు ఆగిపోయాయి. ఆ వచ్చినవ్యక్తి మురళివేపు కొద్ది క్షణాలు పరికించి చూచి 'ఎంతసేపైంది బాబూ నీవొచ్చి' అంటూ నవ్వుతూ పలుకరించాడు. మురళి జవాబుచెప్పి, ఈ వ్యక్తి నళిని నాన్నగారు కాబోలు అనుకున్నాడు.

'అలాగా అమ్మాయి చెప్పింది ఈ పూట వస్తావని' రాఘవయ్యగారు అన్నారు. ఇంతలో నళిని కాఫీతెచ్చి అందించింది. మురళి అందుకుంటూ 'మీరు తీసుకోరా' అన్నాడు రాఘవయ్యగార్ని ఉద్దేశించి. రాఘవయ్యగారు 'ఏదీ కాఫీనా, నా వొంటికి పడదు నాయనా' అన్నారు.

### 4

ఆ రోజు మధ్యాహ్నం మూడు గంటలకు నళిని 'టీ' తీసుకుని మురళి పడుకున్న గదిలోకి వెళ్ళేసరికి మురళి 'నళినీ, నళినీ !' అంటూ కలవరిస్తున్నాడు. మురళి అప్పుడప్పుడు పగటికలలు కంటాడని నళినికి తెలుసు. అతన్ని చూస్తుంటే నళినికి నవ్వూ వచ్చింది కోపమూ వచ్చింది. అవునుమరి, వేళా పాళా లేకుండా ఇష్టమొచ్చినట్లు కలవరిస్తే ఎవరన్నా వింటే ఏమనుకుంటారు ? ఆమె కన్నెమనసు ఆందోళన చెందింది. మురళి మళ్ళీ 'నళినీ, నళినీ' అన్నాడు. 'టీ' కప్పును స్టూలుపై వుంచి నళిని అభయహస్తం పెట్టి నిల్చుంది. "భక్తా ! నీ (ప్రేమ) భక్తికి మెచ్చి ప్రత్యక్షమైతిని ఏమికావలయునో కోరుకొనుము"

కలవరింతల మురళి కళ్ళు తెరిచాడు. ఎదురుగా అభయహస్తంతో నిల్చునివున్నది నళినేనని నిర్ణయించుకుని 'కాఫీ' అన్నాడు

'సారీ భక్తా ఇచట మధ్యాహ్నంపూట కాఫీ దొరకదు, టీ కావాలా ?'

మురళి నీరసంగా నవ్వాడు. నళిని 'కావాలా వద్దా' అని రెట్టించింది ఆలస్యాన్ని భరించలేని దేవతలాగా. ఇక లాభంలేదనుకుని 'సరే ఏదో ఒకటి అనుగ్రహించు దేవీ' అన్నాడు మురళి.

టీ త్రాగుతున్న మురళిని చూస్తూ 'ఇలాగైతే చాల ప్రమాదం' అంది నళిని.

'ఏం ?'

'నన్ను కలవరించటానికి మీకేం అధికారముంది ?

నా కలలోకి రావటానికి నీకేం అధికారముంది ?'

'ఏ సినిమాలో డైలాగిది ?'

'ఏం చేయమంటావ్ నళినీ ! ప్రొద్దునవగా వస్తినికదా ఏదన్నా మంచీ చెడూ మాటాడుంతీ నీ దగ్గరున్నుంచి వస్తుందేమో ననుకుంటే అదేమీ లేకపోయె. నన్నొకడ్ని ఈ గదిలో బంధిస్తివి. కలవరించక ఏంచేసేది ? చూడు నా కెంత జ్వరమో' అంటూ నుదుటిమీద చేయివేసి చూపించాడు.

'జ్వరమా ? నిజంగానా' అంటూ లేచి మురళి నుదుటిమీద చేయివేసి చూసింది నళిని. ఆ చేతిని అలాగే తన చేతుల్లోకి తీసుకుని హృదయంలో దాచుకోవాలని ప్రయత్నించాడు మురళి

'అమ్మ దొంగా !' నళిని వొరిగిపోయింది.

'అమ్మాయ్ ! నళినీ ! ఎవరో వచ్చారు చూడు' రాఘవయ్యగారి పిలుపుకు నళిని మేల్కొంది. విడివడనంటున్న సంకెళ్ళను బలవంతాన విడిపించుకుని వరండాలోకొచ్చింది, ఆ వచ్చిన వ్యక్తిని చూస్తూనే 'అక్కా' అని పరుగెత్తుకుంటూ వెళ్లి ఆప్యాయంగా కౌగలించుకుంది.

తలిదండ్రుల కుశలప్రశ్నలతోనూ, చెల్లెలి ఆత్మీయతతోనూ సరోజిని ఉక్కిరి బిక్కిరైంది. నీడలా వెన్నంటే అసంతృప్తితోనూ వెక్కిరిస్తున్న ఏదో వెలితితోనూ బాధపడే లేత హృదయాలు సానుభూతి, ఆప్యాయతలూ లభించినపుడు వెన్నలా కరిగిపోతాయని సరోజిని రుజువు చేసింది

చెల్లెలు నళినికంటే ఎత్తులోనూ, లావులోనూ తానే చెల్లెలి ననిపిస్తుంది సరోజిని. ఎండిపోయినట్లున్న కపోలాలు ఎన్నో అనుభవాల్ని చాటేలావుండే, గాలికి ఎగిరే రింగుల ముంగురులు ఏదో లోకాల్లో విహరించే ఆమె మనోభావాల్ని చాటుతాయి.

'రా అక్కా ! వార్ని పరిచయంచేస్తాను ! చెల్లెలి మాటల్ని విని ఆమె ననుసరించింది సరోజిని.

'మా అక్క... గుడివాడ హైస్కూల్లో టీచరు...' నళిని మురళికి పరిచయం చేసింది.

మురళి సరోజినివేపు అలాగే చూస్తూ ఉండిపోయాడు. కొన్ని నిముషాలు మౌనంగా

గడిచాయి. ఎవరూ ఏమీ మాట్లాడలేదు. ఆ నిశ్శబ్దాన్ని భరించలేని నళిని 'అదేమిటి అలా చూ[illegible] నాకు తెలుసా ఏమిటి' అంది.

'నాకా? నా కెలా తెలుసు?' మురళి ప్రశ్న...

'మీ రేదో ఆలోచిస్తున్నట్లుగా వుంటేను'

'అదా, అక్క అని చెప్తున్నావు కాని నీకు చెల్లెలుగా కనిపిస్తుం దేమిటా అని ఆలోచిస్తున్నాను'

నళిని నవ్వింది. నవ్వటానికి ప్రయత్నించింది సరోజిని.

మురళి అలా వున్నది వున్నట్లుగా 'అక్కచెల్లెలుగా వుంటావేమ'ని అడగటం సరోజినికి కష్టం కలిగిందని భావించింది నళిని.

'రా అక్కా, స్నానం చేద్దువుగాని, ప్రయాణంచేసి వచ్చావు' అంటూ లోపలికి దారితీసింది నళిని.

## 5

'నీ వెన్నైనా చెప్పు, నీ వీ విషయంలో తొందర పడ్తున్నా వంటాను' అన్నది సరోజిని నొసలు చిట్లిస్తూ.

'నా కలా అనిపించటంలేదు. అలాంటి పిచ్చివేషాలు వేసే రకంకాదు ఆయన'

'కానప్పుడు బాధేలేదు, అయితే, కాదనే విషయం బాగా ఖాయంగా తెలుసుకుని మాత్రం ప్రవర్తించు. వయసులో నీకంటే పెద్దదాన్నే.'

సరోజిని అంత కఠినంగా, నిష్కర్షగా మాట్లాడటం నళినికి ఆశ్చర్యాన్నే కల్గించింది.

వరలక్ష్మమ్మగారుకూడ ఆదేమాట చెప్పింది.

'మీ రిద్దరూ ప్రేమించుకున్నారు బాగానే వుంది. పెద్దవాళ్ల ఉద్దేశ్యాలు తెలుసుకోవాలిగా. ఆ అబ్బాయి తల్లిదండ్రుల ఇష్టాయిష్టాలుకూడ కనుక్కోమరి. వాళ్లు కాదంటే ఎదిరించి పెళ్లిచేసుకునే ధైర్యమూ తెగింపూ వున్నాయా? అసలెప్పుడైనా ఈ విషయాన్ని గురించి మాట్లాడేవా?' అని నిలదీసింది.

ఏం జవాబు చెప్పాలో తోచలేదు నళినికి. తనకిన్ని అనుమానాలు కలుగనేలేదు. మనసులు కలిశాయి. ఒకరిమీద మరొకరికి సదభిప్రాయం కలిగింది. ఇక పెళ్లికి ఆటంకాలేముంటాయనుకుంది. ఒకవేళ ఏమైనా ఆటంకాలు వచ్చినా, మురళి నాన్నింటినీ త్రోసి రాజని తనని చేపట్టుతాడని తన ప్రగాఢ విశ్వాసం అయినా తనవాళ్ళ సంశయాన్ని నివృత్తి చేయాల్సిన బాధ్యత తనకుంది గాబట్టి, తెల్లవారిం తర్వాత ఈ విషయాలన్నీ ఆయనతో ముచ్చటించాలనీ, అమ్మ, అక్కల అనుమానాల్ని సమూలంగా తుడిచివేయాలనీ, అసలు ఆయన నోటిమీదుగానే అన్ని విషయాలూ చెప్పించాలనీ అనుకుంది. అలా నిర్ణయించుకున్న తర్వాత ఆమెకు వెంటనే నిద్ర పట్టేసింది.

తెల్లవారే సరికి సరోజిక విపరీతంగా జ్వరం వచ్చింది. రాఘవయ్యగారు డాక్టరుకోసం పరుగెత్తారు. రాక రాక ఇంటికి వచ్చిన కూతురు ఉన్న నాలుగు రోజులు కులాసాగా గడపకుండా ఈ జ్వరమేమిట్రా భగవంతుడా అని కళ్ళు తుడుచుకుంది వరలక్ష్మమ్మగారు. ఏపని చేయటానికీ పాలుపోవటంలేదామెకు. నళినికూడ చాల బాధపడింది. తను రమ్మనమని ప్రాధేయపడుతూ ఉత్తరం రాయటం, అక్క రావటం, తమ ప్రణయగాథను చెప్పినపుడు నిష్కర్షగా ముందు జాగ్రత్త పడమని అక్క సలహా చెప్పటం నళిని మనసులో మెదిలాయి. 'అక్క చాలమంచిది' అనుకున్న నళిని సరోజినికి పరిచర్యలుచేస్తూ అక్కడే కూర్చుండిపోయింది

నళిని ఎప్పుడూ సరోజిని దగ్గర కూర్చోటం మురళికి నచ్చలేదు. తను ఇంతదూరం పని గట్టుకుని వచ్చింది ఎందుకు? అసలు రమ్మనమని రాసిందెందుకు? ఈ సరోజినికూడ ఇప్పుడే రావాలా అని విసుక్కున్నాడు.

డాక్టరు రాలేదు. ఏవో నాలుగు పొట్లాలు పంపి గంటకొకటి వాడమన్నాడుట. 'పంచదార మాత్రల్ని వాడే పిచ్చి వీళ్ళకే ఉందన్నమాట' అనుకున్నాడు మురళి మురళికి హోమియోపతి వైద్యమంటే గిట్టదు. చిన్న చూపు. కాని, సరోజినికి జ్వరం తగ్గింది.

మురళిని ఎన్నో విషయాలు అడగాలనుకున్న నళినికి ఆ అవకాశం కలుగలేదు, ఆ రోజు మధ్యాహ్నం మూడు గంటలవరకూ పొద్దుటినుండి మూసిన కన్ను తెరవకుండా పడివున్న సరోజినిని విడువలేక పోయింది. అమ్మ టీ తయారు చేస్తోంది. మురళి నిద్ర లేచాడేమో చూద్దామని అతని గదిలోకి వెళ్లింది నళిని మురళి అక్కడ లేడు. ఎక్కడికి వెళ్ళి వుంటాడా అని ఆలోచిస్తూ వెనక్కు తిరిగింది, మురళి సరోజిని గదిలో నుంచి అప్పుడే బయటకు వస్తున్నాడు వస్తూనే అన్నాడు 'ఎక్కడున్నావు నళినీ, నీకోసం ప్రపంచమంతా గాలిస్తున్నాను.'

'ప్రపంచమంతా గాలిస్తున్నారా, ప్రత్యేకంగా కొన్ని గదులు మాత్రమే గాలిస్తున్నారా, ఒకచూపు విసరి 'టీ తెస్తానుండండి' అంటూ వెళ్ళింది నళిని అక్కడ్నుంచి.

నళిని మాటల్లోని వ్యంగ్యాన్ని గ్రహించాడు మురళి. తను సరోజిని గదిలోకి వెళ్ళి వచ్చినందుకు ఏమనుకుందో. ఈ ఆడవాళ్ళంతా ఇంతే. అసూయ ఆడదానికి పర్యాయ పదమేమో!

నళిని టీ తెచ్చింది. మురళి టీని సిప్ చేస్తూ. నళిని కళ్ళల్లోకి చూస్తున్నాడు. నళిని ఏదో ఆలోచిస్తోంది.

'ఏమిటి నళినీ ఆలోచిస్తున్నావ్?'

'ఏమీ లేదు'

'లేదంటే సరిపోతుందా. నీ కళ్లు చెప్తున్నాయిలే'

'దేనికి నాకోసం గాలిస్తున్నానన్నారు?'

'నీతో విషయం చెప్దామని'

'ఏమిటది?'

'నేను రేపు వెళ్లిపోతున్నాను'

'ఏం?'

'ఏమేం వుంది? రమ్మన్నావు వచ్చాను. రెండ్రోజులున్నాను. ఇంకా ఎన్నాళ్లుండమంటావ్? నాకేం తోచడంలేదు'

నళిని ఆలోచనలో పడింది. మురళి ఇంత హఠాత్తుగా వెళ్తానంటాడేం? అక్కతో ఏమైనా మాట్లాడేడా? అక్క ఏమైనా అడి

గిందా మురళిని? అసలు ఈయన అక్కడి కెందుకు వెళ్లినట్లు? ఈమగవాళ్లే అంతర్యా లేమిటో ఒక పట్టాన అర్థంకావు. అనుకుంది నళిని.

నళి మనసులో తననేదో అడగాలని వుం దని, కాని అడగలేకపోతున్నదనీ గ్రహిం చాడు మురళి తప్పును కిరింద పెట్టి నళినిని దగ్గ రకు తీసుకుంటూ అన్నాడు 'వెళ్లమంటావా నళినీ మాట్లాడవేమిటి?'

నళిని కరగిపోయింది. ఆమె వూహాలన్నీ సెరిసోయినై. మనసులోని సందేహాలన్నీ "క్షణం" మాయమైనాయి. కొద్దిసేపైన తర్వాత పెళ్ళి విషయం అడుగుదామని ప్రయ త్నించింది. కాని అడగలేకపోతోంది. సిగ్గు ముంచుకొస్తోంది. నిదానంగా అడుగుదామని వాయిదా వేసుకుంది. 'రేపు వెళ్ళరుగానిలే వుండండి' అంది.

నళిని వుండమంటుందని మురళికి తెలుసు.

సాయంత్రానికల్లా సరోజినికి జ్వరం పూర్తిగా తగ్గింది. సాయంత్రంపూట కాఫీ తాగి అలా షికారుకు వెళ్లొచ్చారు సరోజిని, నళిని. మురళి రాఘవయ్యగారితో కలసి ఊరు నలువేపులా చూసివచ్చాడు. రాఘవయ్య గారు మాటల మధ్యలో చెప్పారు: 'సరోజిని ఉద్యోగంలో మునిగిపోయింది. ఇప్పట్లో పెళ్ళిచేసుకోనంటున్నది. ముందు నళినికి పెళ్ళి చెయ్యమంటుంది. వచ్చేనెలలో నళినికి వివా హం చేద్దామనే ఆలోచన వుంది.

మురళి విన్నాడు నళినిని తాను వివాహం చేసుకుంటానని, చెప్దామనుకున్నాడు. కాని అభిమానం అడ్డుతగిలింది. మాట్లాడకుండా వూరుకున్నాడు. మనస్సులో మాత్రం, ఈ రాత్రికో రేపో నళినితో తన నిర్ణయం చెప్పాలనుకున్నాడు. దానికి ముందు తన నిర్ణ యానికి అడ్డునిలచే ఒకప్రతిష్టంభనను ఆరోజు తొలగించుకోవా లనుకున్నాడు.

## 6

రాత్రి పదిగంటలైంది. వరలక్ష్మమ్మగారు, రాఘవయ్యగారు దొడ్లో తులసికోటవద్ద ఆరు బయట నిద్రపోతున్నారు. వరండాలో మడత మంచంమీద పడుకున్న మురళికి నిద్ర పట్ట లేదు. ఉండి వుండి సరోజిని, నళిని పడు కున్న గదివేపు దృష్టి సారిస్తున్నాడు. రేయి ప్రశాంతతను భగ్నపరుస్తూ అతని మనసులో ఏదో అశాంతి నిండుకుంది తన ఆవేదనను ఎవరికైనా నివేదించుకుంటే హాయి కలుగు తుందనే ఆశ, ఆకాశంలోని తారకలా. ఆ ఆశా తారకకు అడ్డువచ్చే మేఘాల్ని ఆపలేకపోతు న్నాడు తను.

లోపల నళినికీ నిద్రపట్టలేదు. 'అందరికీ నిద్రపట్టినపుడు తనకు నిద్రపట్టక పోవట మేంవిటి? లేక అందరూ తనలాగే నిద్రపట్టక పోయినా నిద్రపోతున్నట్లు కనిపిస్తున్నారా?' నళిని సరోజిని పడుకున్న మంచంవేపుచూసింది. సరోజిని కూడా మసలుతూనే వుంది. తెం గానే అక్క చెప్పిన విషయాలు గుర్తుకొచ్చాయి నళినికి మగవాళ్లంతా తుమ్మెదల్లాంటివాళ్లుట. వాళ్లతో ప్రవర్తించేటప్పుడు జాగ్రత్తగా వుం డాలిట. పెళ్లిగా రూపొందలేని ప్రేమ అవాంఛనీయమైనదిట. నళినికి నవ్వువచ్చింది. 'అక్క కెందుకో వేదాంతం బాగా తల కెక్కింది. నిరాశావాదం, వైరాగ్యపు ధోరణి కనుపిస్తున్నాయి ఆమెలో. అక్క కూడా ఎవరినైనా ప్రేమించిందా? అరరే! అక్కను బాధించే సమస్యలేమిటో అడగటమే మర్చి పోయానే రేపైనా అడగాలి. రేపు మురళిని పెళ్లివిషయంకూడా అడగాలి. రేపు వీలుం టుందో వుండదో. ఇప్పుడుపెళ్లి అడిగితే?' నళినికి రకరకాలైన ఆలోచనలు కలిగినై.

లేవటానికి ధైర్యం చాలటంలేదు. అక్క కూడా మసలుతూనే వుంది. గత్యంతరంలేక నిద్ర కుపక్రమించింది. ఆమె కళ్లముందు ఒక తెర పడింది.

మురళి నిద్రపోతున్నాడు. లేతనీలిరంగు లైటు కాంతిలో సన్నని చిరునవ్వుతో ఏవేవో మధుర వూహాలతో కలలుకంటూ నిద్రపోతున్న మురళిని ఇంకా యింకా చూడాలనిపించింది నళినికి. పాపం, పగలే కలలు కంటాడు. కలలో తను కనిపిస్తూ వుంటుంది కాబోలు! 'నళినీ' అంటూ కలవరిస్తూ వుంటాడు. వారికి నేనంటే ఎంతో ప్రేమ' ఆ తలపురాగానే నళిని మనసు మధురభావనాభరితమైంది. ఆమధు రిమలో, నిద్రపోతున్న మురళిని అలా అలా మెల్లిగా ముద్దుడుకోవాలనే బలీయకోరిక ఉద్భ వించింది తన తలపుకు తనకే నవ్వువచ్చింది. ఎవరూ చూడటంలేదు గదా అనే మురళి మీదకు వొంగింది.

'సరోజినీ!'

నళిని గబుక్కున నిల్చుంది. ఇదేమిటి 'స రో జి నీ' అని కలవరిస్తున్నాడేమిటి? క్రొత్తగా సరోజిని కనుపించేసరికి మనసు అటు వెళ్ళిందా? అంత చపలమా? పైగా ఆడ వాళ్లని చపలచిత్తులంటారే. మరి ఈ కలవ రింతలేమిటి? సభ్యతకూ సమాజానికీ జడిసి పైకి వ్యక్తంకాని కోరికలు కలల్లో మొలకెత్తి కోరికమనసును తృప్తిపరుస్తాయట – ఇదే కాబోలు. ఇందుకే కాబోలు మధ్యాహ్నం అక్క వున్న గదిలోకి వెళ్లింది- అనుకున్న నళినికి అప్పుడే అక్కడికివచ్చి నిల్చున్న సరో జిని కనిపించింది. మురళి, సరోజినీ చేతిలో చేయి వేసుకుని ఎటో నడిచి వెళ్తున్నారు. అమృత హృదయంలో విషబిందువు చిలికినట్ల యింది. ఏదో వికృతశక్తి తన గుండెలపై నర్తి స్తున్నట్లనిపించింది. గుండెలమీది ఆ బరువును భరించలేక చివాలునలేచి కూర్చుంది నళిని.

కీచురాయి గొంతులో చీకటి గీతం సన్నగా విన్పిస్తోంది. కోడిగ్రుడ్డు లాంతరు శక్తివంచన లేకుండా గది అంతటికీ సన్నని వెలుగునిస్తోంది. స్వాప్నికావస్థలో తనకు కలిగిన అనుభూతి జ్ఞప్తికొచ్చింది నళినికి. 'అక్క మంచంవేపు చూసింది. అక్క అక్కడలేదు. నళిని దిగ్భ్రాంతురాలైంది. నక్షత్రాల సన్నని వెలుగు పెరటి గుమ్మంద్వారా లోపలికి వస్తోంది. నళిని మెల్లగాలేచి గుమ్మంవద్ద కెళ్లింది. తన కళ్లను తానే నమ్మలేకపోయింది. స్వాప్నికదృశ్యం వాస్తవమై గోచరిస్తున్నది. ఆమె హృదయం వ్రయ్యలైంది.

అరచేతుల్లో ముఖాన్ని దాచుకుని ఏడు స్తోంది సరోజిని. మురళి ఆమెను వోదార్చా లని విఫలప్రయత్నం చేస్తున్నాడు. ఏదో పిట్ట వారిద్దరి నెత్తిపైన గిరగిర తిరుగుతూ గిరి గీయ సాగింది.

'నిజం సరూ! ప్రమాణంచేసి చెప్తున్నాను నాకలాంటి దురుద్దేశ్యమే లేదు. మనస్ఫూర్తిగా చెప్తున్నాను. నళిని నా అర్ధాంగిగా ఎప్పుడో నా హృదయంలో స్థావరమేర్పరచుకుంది. కాని... కాని... నళిని నీ చెల్లెలని ఇక్కడి కొచ్చేవరకూ నాకు తెలియదు'

'నా చెల్లెలు కాబట్టే నాలాగే మోసపోవటానికి సిద్ధంగా వుంది. కాని నేను నా చెల్లెల్ని రక్షిస్తాను. నీవు నాకు నేర్పినపాఠం మర్చిపోలేదు మురళీ... మర్చిపోలేదు.'

కొన్ని క్షణాల మౌనం. పెల్లుబికి వచ్చే దుఃఖాన్ని బలవంతాన ఆపప్రయత్నించినందు వల్ల కలిగే ఎక్కిళ్లు....

'నేను నీకు అన్యాయమే చేశాను సరూ! నన్ను క్షమించు. తెలిసీ తెలియక ఇద్దరమూ ఆవేశాలకి లొంగిపోయాము. తప్పు చేశాము అయిపోయింది...'

'అవును అయిపోయింది. ఎప్పటికప్పుడు అయిపోతూనే వుంటుంది' సరోజిని కటువుగానే అంది.

మురళి అన్నాడు 'ఒకసారి తప్పుచేసి పశ్చాత్తాపపడే మానవుడు మళ్లీ ఆ తప్పును చేయడు సరూ! జరిగిందానికి నేనెంతగా కుమిలిపోయానో నీకేం తెలుసు ఆ తర్వాత నీ కోసం ఎంతగా పరితపించానో నీ ఉనికిని తెలుసుకునేందుకు ఎంతగా ప్రయత్నించానో భగవంతుడికే ఎరుక. కాని నీ జాడ తెలీలేదు ఇంతలో నళిని నా హృదయంలో ప్రవేశించింది. నీ స్థానాన్ని ఆక్రమించింది.'

'చెప్పకు మురళీ. చెప్పకు. నే వినలేను. ఆ బాధ భరించలేను. నీతో గడిపిన రోజులే నా జీవితానికి వెలుగురేఖలు. ఆ మధుర స్మృతుల్లోనే జీవితశేషాన్ని గడుపుదామనుకున్నాను. నీవు మళ్లా తటస్థపడతావనుకోలేదు అందులోనూ నా చెల్లెలు ప్రేమించిన వ్యక్తిగా'

మళ్లీ కొంచెంసేపు నిశ్శబ్దం ఆవరించింది.

'నేను మాత్రం కలగన్నానా 'ఇలా కలుస్తా'మని. ఇప్పుడు నన్నేం చేయమంటావో చెప్పు.'

'తక్షణం ఇక్కడ్నుంచి వెళ్లిపో'

'అసంభవం సరోజినీ'

'నీవు వెళ్లి తీరాలి. నిన్నిప్పుడు వివాహం చేసుకోటం అసంభవం. నేనిలాగే వుంటాను. తొందరపడి వేసిన తప్పటడుగుకు నాకిదే శిక్ష.'

'తప్పుచేసిన మన మిద్దరమూ శిక్ష ననుభవించటం న్యాయమే. కాని ఏమీ ఎరుగని నళిని ఎందుకు శిక్ష ననుభవించాలి? నేనిప్పుడు అర్థాంతరంగా వెళ్లిపోతే నళిని ఏమనుకుంటుంది? ఆమె సున్నితమైన హృదయం ఎంత దెబ్బతింటుంది?'

సరోజిని మాట్లాడలేదు. తన మూలంగా చెల్లెలి ఆశలు తలక్రిందులు కావటం ఆమె కిష్టంగా కనిపించలేదు.

'అందుకనే నీవనుజ్ఞ యిస్తే రేపు ఉదయమే నళినితో మా వివాహం సంగతి చెప్తాను. పాపం ఈ విషయం అడగాలని నిన్నటినుంచీ ప్రయత్నిస్తోంది నళిని' గదిలో చెంబు దొర్లిన చప్పుడయింది. సరోజిని గబగబా లోపలికి నడిచింది.

తెల్లవారింది. బద్ధకంగా ఆవులిస్తూ చీకటిని వివల్చుకుంది ప్రకృతి. నళిని కాఫీ కప్పుతో మురళి గదిలోకి అడుగుపెట్టింది కప్పును స్టూలుపైవుంచి వెనుదిరిగి రాబోయింది. కప్పు నందుకుంటూ 'నళినీ' అని పిల్చాడు మురళి నళిని ఆగింది.

'నేనొక మంచి శుభవార్త చెప్పనా' అన్నాడు కాఫీని సిప్ చేస్తూ. నళిని మాట్లాడలేదు.

'శుభవార్త తర్వాత చెప్తాను ముందుజ్యోతిష్యం చెప్తాను ఏదీ ఆ చెయ్యి ఇలాఇవ్వు' అని నళిని చేతిని తన చేతులోకి తీసుకున్నాడు. 'నీవు రెండ్రోజుల్నుంచి ఒకవ్యక్తిని ఏదో అడగాలనుకుంటున్నావు. కాని నీవు అడుగకుండానే నీ మనసులోని ప్రశ్న ఆ వ్యక్తికి తెలిసిపోయింది...'

'మీజ్యోతిష్యం నాకేం అక్కర్లేదు.' నళిని చేతిని లాక్కుంది. నళిని ప్రవర్తనకు మురళి హతాశుడైనాడు. అయినా ఆమెలో సంతోషాన్ని కల్గించాలని 'నేనొక నిర్ణయానికి వచ్చాను నళినీ! త్వరలో మన వివాహం జరిగే ఏర్పాట్లు చేస్తాను. నువ్వు మీ నాన్నతో చెప్పు' అన్నాడు.

నళిని నయనాల్నుండి, నీటిబొట్లు టపటప రాలాయి. 'క్షమించు బావా నేను పెళ్లిచేసుకోను' నళిని వెళ్లిపోయింది.

మురళి నిర్విణ్ణుడైనాడు. ఆ సంబోధన ఆ జవాబు అతనికి అంతా చెప్పేశాయి. చేతిలోని కప్పు క్రిందపడి పగిలిపోయింది తను వచ్చిన పని పూర్తయింది.

మొదటచేసిన తప్పును ఈ విధంగానైనా దిద్దుకోవాలని ఆశించిన అతని ఆశ నిరాశగా మారింది. నళినిని బ్రతిమాలి లాభం లేదనిపించింది.

ఒక అరగంటలో అన్నీ సర్దుకుని ప్రయాణమైనాడు.

చేతిలో సంచీతో మధ్యహాల్లో కొచ్చాడు మురళి. కుర్చీలో కూర్చుని పేపరు చదువుకుంటున్న రాఘవయ్యగారు ప్రశ్నార్థకంగా చూశారు అతనివేపు వరలక్ష్మమ్మగారు, నళిని లోపలి గుమ్మంలో నిలబడివున్నారు. ఎవరి ముఖంలోకి చూడటానికీ మురళికి ధైర్యం చాల్లేదు.

గుమ్మానికీ, రాఘవయ్యగారికీ మధ్యగా టేబులు, దానిపైన తెల్లని టేబుల్ క్లాత్, పుస్తకాలు, ఫ్లవర్ వేజ్ అందులోని రంగురంగుల గడ్డిపూలు ఆ పూల తలలు గాలికి అటూ ఇటూ కదిలాయి, అతనికి వీడ్కోలు చెప్తున్నట్టుగా వాటివేపే చూస్తూ 'నే వెళ్తున్నాను' అన్నాడు మురళి.

ఎవరూ మాట్లాడలేదు. నాలుగడుగులు వేశాడు మురళి

ఎందుకు వచ్చాడో, ఎందుకు వెళ్తున్నాడో తెలియని రాఘవయ్యగారు క్షణకాలం పేపరు చదవటం మాని వెళ్తున్న మురళివేపు చూస్తూ ఉండిపోయారు. ఏమీఅర్థం కాని వరలక్ష్మమ్మగారు నిర్లిప్తంగా చూడటంకన్నా వేరేమీ చేయలేకపోయింది.

నళిని పైటకొంగును నోట కుక్కుకుంది.

కిటికీలోనుండి రెండు కన్నీటి కళ్లు వెళ్తున్న మురళిని చూస్తూనే వున్నాయి.

---